# పులి

"చలి నిన్ను పులి మింగిపోనూ—
ఎండయ్యతో చెప్పి
నిను పట్టి కట్టించుకొనే—"

అని శపించాడు—గజగజ వణికించే చలిని ఒక కవి. 'మింగడం' అనేది పులి ప్రత్యేకత. అందుకే గాబోలు డబ్బు గుటకాయి స్వాహా చేసేవాణ్ణి 'బోసిపులి' అంటారు. చాలామంది భార్యల్ని దిగమింగినవాణ్ణి 'పెళ్లాలపులి' అనటం పరిపాటి అయింది.

పులికి పౌరాణికంగా కూడా ప్రఖ్యాతి వుంది. దుర్గాదేవి వాహనం పెద్దపులి. శంకరుడు కప్పుకునేది పులిచర్మం. చాలా పవిత్రమైంది అందుకనే మహాత్ములంతా కూడా పులిచర్మాన్ని ఆసనంగా వుపయోగించుకున్నారు.

పులి కార్జం తింటే పులి అంతటి పౌరుషం పుట్టుకొస్తుందని చైనా వారి నమ్మకం. పులిమాంసం అనేక వైద్యగుణాలు కలిగి వుంటుందని శాస్త్రజ్ఞుల వూహ. పులికి విషమంతా దాని మీసాల్లోనే వుందట. అందుకనే పులిని చంపిన వెంటనే దాని మీసాలు రద్దుచేస్తారు కాబోలు. బహుశః దీన్ని బట్టే వచ్చివుంటుంది—అపాయాన్ని సూచించే "పులి మీసాలు పట్టుకొని ఉయ్యాలూగినట్టు" అనేసామెత.

మనసాహిత్యంలో పులికి సంబంధించిన సామెతలు కొల్లలు. సాధారణంగా భయం కలిగించేమనుష్యులను 'అదుగో పులి' అంటుంటారు. అయితే ఆఫీసుల్లో స్ట్రిక్టుగా వుండి యింట్లో పిల్లిలాగా వుండేవాళ్ళను 'బయట పులి' 'ఇంట్లో పిల్లి' అని వ్యాఖ్యానిస్తూ వుంటారు. ఇలాంటిదే మరో సామెత— "ఇంట్లో ఈగపులి,, బైట పెద్దపులి."

"ఇదిగో పులి అంటె అదిగో తోక" అన్నట్టు (గోరంతని కొండంత చేయడం.)

"పులి ఎదటైనా పడవచ్చుగాని నగరివారి ఎదట పడరాదు." అంటే ప్రభుత్వోద్యోగుల ఎదట పట్టం పులి ఎదట పట్టం కన్న కూడ కష్టం అన్నమాట. ఇదే రకంది మరొకటి-"పెద్ద పులి తరుముకు వచ్చినా బజారం ముందుకు పోరాదు."

"పులినిచూచి నక్క వాతపెట్టుకున్నట్టు"- ఇదొక సామెత,

పులికి సంబంధించి జాతి లక్షణాల్ని సూచించేవి కొన్ని మన సాహిత్యంలో వున్నాయి.

"పులికి ఆకలయితే గడ్డి తింటుందా ?"
"పులి కడుపున పిల్లిపిల్ల పుడుతుందా"
"పులిపిల్ల పులిపిల్లే, మేకపిల్ల మేకపిల్లే"
"మూసపులికి లేడిదీటా"
ఇత్యాదులు కొల్లలు.

"నవాబంత దరిద్రుడు; పులి అంత సాధువు (అవహేళన)

## వి. కే. దాసరి

"పులిమీద పుట్ర" (అపాయం వెంబడి అపాయం.)

ఈనిన పులికి చెప్పలేనంత ఆకలి. అందువల్ల అది తనపిల్లల్నే తను మింగివేస్తుంది. ఈలా మింగివేయుటమే సృష్టి చిత్రమూ, దేవుని వుద్దేశ్యమూ. ఎందుకంటే పెద్దపులికి పుట్టిన పిల్లలన్నీ బతకడం సంభవిస్తే అసలు ఈ ప్రపంచమే వుండదేమో.

"పులి పక్కన వున్న జోరీగ"—ఇంక జోరీగకి భయమేమిటి ?

"పులినోట విడిచినట్టు" (గొప్ప ఆపద నుండి బతికి రావటం.)

"పులినాకనూ, అయ్య బతకనూనా" (అసంభవం) ఇట్లాంటి భయంకరమైన పెద్దపులి బాలసాహిత్యంలో స్థానం సంపాదించగలిగింది.

"ఇద్దరు ముగ్గురు ఒకచోట
ఒంటిపులి రాకా సోకచోట..."

అనేపాటతో పిల్లల్ని ఎగతాళి చేస్తుంటారు.

బాలసాహిత్యంలోనే ఆనంద పరచే సుప్రసిద్ధ 'పులి' గాథలు.
'తోక పీకుడుగాడు' కథ—
'పులిగాడికి గిలిగాడు'—
'పులికి చారలెటావచ్చాయి?'—

సాధారణంగా మనం జానపదకథల్లో ఒక కష్టమైనపని చేసుకు రమ్మనటం పరిపాటి. అదే 'పులిపాలు' పితికి తెమ్మ'నటం.

భోజరాజీయంలో 'గోవ్యాఘ్ర సంవాదం' అందరికీ తెలిసిందే అతిజాలి గొలిపేదీ నీతి దాయకమైనదీనూ. ఇది విని కన్నీరు కార్చనివా రుండరు.

'పెద్దపులిగోరు' పిల్లల మెళ్ళో గోరుని బంగారంతో పొదిగించి వేయడం కద్దు. దానివల్ల దృష్టిదోషం తొలగి పోతుందని నమ్మకం. ఇదే 'పులిగోరు పతకం'—

పులిని గూర్చి కొన్ని జాతీయాలు కూడా వున్నాయి.

'మెత్తని పులి' పైకి మెత్తగా కన్పించి లోలోపల కొంప లార్పేవాడు. ఇలాంటిదే 'మేకవన్నె పులి'

పీర్లపండగల్లోనూ, గ్రామదేవత జాతర్లలోనూ పులివేషాలేయడం ఒక వేడుక.

చారిత్రిక విషయాల్లోకి పోతే 'బొబ్బిలిబెబ్బులి' తాండ్ర పాపారాయుడు తటాలున జ్ఞాపకం వస్తాడు.

సంస్కృతంలో కూడా 'పులి'కి సంబంధించిన లోకోక్తులు వున్నవి.

'ఉపోషితస్య వ్యాఘ్రస్య పారణం పశుమారణం' అంటే ఉపవాసంతో వున్న పులికి పశువులను చంపడమే పారణం—అని అర్థం.

'వనవ్యాఘ్రన్యాయ' మని వుంది ఒక న్యాయం. అడవికీ, పులికీ అవినాభావ సంబంధముంది. అంటే అడివిని విడిచి పులీ, పులిని విడిచి ఆడివీ వుండలేవు పులి లేకపోతే అడవులకు రక్షణావుండదు. అడివి లేకపోతే పులులకు రక్షణా లేదు. ఇదీ వనవ్యాఘ్రన్యాయం.

'తరక్షు డాకినీ న్యాయ' మని మరొక న్యాయముంది. దీని అర్థం — 'పెద్దపులి వాహనం మీద కూర్చొని బయలుదేరిన మహాకాళిలాగ' అని. పెద్దపులి భయంకరమైంది. దానికితోడు మహాభయంకరమైనది మహాకాళి. ఎక్కువ భయం పుట్టించే సందర్భంలో ఈ న్యాయాన్ని వాడుతారు.

'వ్యాఘ్రచోర ధనుర్న్యాయం' అని మరొకటి—ఈ లోకోక్తి చాలా చిత్రమైన పోలికల్ని సూచిస్తుంది. పెద్దపులి పొదలో పొంచి మృగాలమీదికి దూకుతుంది. దొంగ ఒకచోట దాక్కొని వుండి కన్నం తవ్వుతాడు. విల్లు మొదట వంగి బాణాన్ని విసుస్తుంది ఆదేవిధంగా దుర్మార్గుడుకూడా వినయం నటిస్తూ కొంపలార్పుతాడని ఈ న్యాయం భావం.

ఇక 'గోముఖ వ్యాఘ్రం' సంగతి చెప్పేదేముంది? ఈ విధంగా మనసారస్వతంలో పులిని గూర్చిన ప్రశంస కన్పిస్తూంటుంది. ★